తొర్రూరులో నిర్వహించిన మహాధర్నాలో పాల్గొన్న రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు, మాట్లాడుతున్న హరీశ్‌రావు, ఎడ్ల బండిపై ర్యాలీగా వస్తున్న హరీశ్‌రావు, చిత్రంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు

రాహుల్ ఇంటిని ముట్టడిస్తాం

దసరాలోగా అందరికీ రుణమాఫీ చేయాల్సిందే • వరంగల్ రైతు డిక్లరేషన్ అమలు ఏమైంది?: హరీశ్

- ఎమ్మెల్యేలు, మంత్రులను రైతులు నిలదీయాలి
- రేవంత్.. మొనగాడు కాదు మోసగాడు..
- 70% రైతులకు రుణమాఫీ కాలేదు..
- వరద బాధితులకు ఇచ్చిన హామీ ఏమైంది?
- బతుకమ్మ చీరలు బాగాలేవు అన్నావు.. రూ..500 ఇస్తా అన్నావు.. ఏమైంది?
- తొర్రూరు మహాధర్నాలో హరీశ్‌రావు

మహబూబాబాద్, అక్టోబర్4(నమస్తే తెలంగాణ): దసరాలోపు రైతులందరికీ రూ.2 లక్షల వరకు షరతులు లేకుండా రుణమాఫీ చేయకుంటే, ఢిల్లీలో రాహుల్‌గాంధీ ఇంటి ముందు ధర్నా చేస్తామని, వరంగల్ రైతు డిక్లరేషన్‌పై నిలదీస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 30% మంది రైతులకే రుణమాఫీ అయిందని, మిగిలిన 70% మందికి మాఫీ చేసేదాకా వదిలిపెట్టబోమని స్పష్టంచేశారు. పండుగ తరువాత కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ.. రుణమాఫీకి 31 సాకులు పెట్టి లక్షలాది రైతులకు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలకుర్తి మండలంలోనే 4,314 మందికి రుణమాఫీ కాలేదని చెప్పారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పున్నట్టుగా 22 లక్షల మందికి కూడా మాఫీ కాలేదని దుయ్యబట్టారు. 'రుణమాఫీ కాలేదు అంటే, పెండ్లి కాలేదు అంటున్నరట, కొందరికి ఆధార్‌కార్డు లేక ఆపుతున్నరు. ఇదేమి రాజ్యం?' అని హరీశ్‌రావు మండిపడ్డారు. రేవంత్ మోసగాడని రైతులు, ప్రజలు అంటున్నారనిచెప్పారు. కర్ణాటకలో ఐదు, తెలంగాణలో ఆరు, ఇప్పుడు హర్యానాలో 7 గ్యారెంటీలు అంటున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్ అమలుకావడం లేదని దుయ్యబట్టారు. 'రైతులతోపాటు కౌలురైతులకు ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు ఇస్తా అన్నడు. కాలేదు.. భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అన్నడు.. కాలేదు.. రైతు కూలీలు, భూమి లేని రైతులకు పంట బీమా పథకం అన్నడు. కాలేదు.. పోడు, అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు ఇస్తా అన్నడు. కాలేదు.. అన్ని రకాల పంటలకు రూ.500 బోనస్ అని చెప్పి, ఇప్పుడు సన్నాలకు మాత్రమే అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నడు' అని హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి దయ వల్ల రాహుల్‌గాంధీ మీద తెలంగాణ ప్రజలకు, రైతులకు నమ్మకం లేకుండా పోతున్నదని ఎద్దేవా చేశారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌ను ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు.

దసరాలోగా రైతుబంధు ఇవ్వాలి

వానకాలం సీజన్ ముగుస్తున్నా రైతుబంధు ఇవ్వలేదని, ఇంకెప్పుడు ఇస్తరని హరీశ్‌రావు

> రైతుల కన్నీళ్లు చూస్తే రాతి గుండెలు కూడా కరుగుతాయి. కానీ, రేవంత్‌రెడ్డి గుండె మాత్రం కరగడం లేదు. రేవంత్‌ది రాతి గుండె కాబట్టే రైతుబంధు ఇవ్వడం లేదు. రుణమాఫీ చేయడం లేదు. రైతుల ఆత్మహత్యలు కనిపించడం లేదా?
> -హరీశ్‌రావు

ప్రశ్నించారు. దసరా లోపు రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రభుత్వ ఉద్యోగులు జీతాలు ఆపి, రైతులకు రైతుబంధు కేసీఆర్ ఇచ్చారని చెప్పారు. కేసీఆర్‌ది రైతు గుండె కాబట్టి ఇచ్చారని, రేవంత్‌ది రాతిగుండె కాబట్టే ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఎన్నికల ముందు అన్ని పంటలకు బోనస్ అని చెప్పి ఇప్పుడు సన్నాలకు మాత్రమే ఇస్తామంటున్నారని మండిపడ్డారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాలేదన్న మనోవ్యథతో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో తరావత్ రవి అనే రైతు, సిద్దిపేట జిల్లాలో సురేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులెవరూ ఆధైర్యపడొద్దని, ఆత్మహత్యలు చేసుకోవద్దని ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, రేవంత్‌రెడ్డి మెడలు వంచి రుణమాఫీ అమలు చేయిస్తామని చెప్పారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు వచ్చే ఎమ్మెల్యేలు, మంత్రులను నిలదీయాలని రైతులకు పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో రౌడీయిజం

రాష్ట్రంలో రౌడీయిజం నడుస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో అరాచకం చేస్తున్నారని మండిపడ్డారు. మూసీని ఆనుకొని ఉన్న పేదల ఇండ్లు కూలగొడితే ఊరుకోబోమని హెచ్చరించారు. ఎక్కువ కాలం గుండాగిరి నిలబడదని హితవు చెప్పారు. 'అది కొడతా, ఇది కొడతా అంటున్నవ్. అన్యాయంగా ఉన్న ప్రతి ఒక్కరిదీ కూలగొట్టు.. దగ్గర ఉండి సహకారం అందిస్తాం. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా మాది ప్రజలపక్షం' అని హరీశ్‌రావు స్పష్టంచేశారు. కేసీఆర్ ఇచ్చిన బతుకమ్మ చీరలు బాగాలేవని విమర్శించిన రేవంత్‌రెడ్డి బతుకమ్మ చీరలు లేదా వాటి బదులు ఇస్తానన్న రూ.500 మహిళలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరదల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఇస్తామన్న రూ.పదివేల ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో తన మీద 300 కేసులు పెట్టారని, ఇప్పటికే 30 పెట్టారని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టినా హామీల అమలుపై ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో ఎందుకు చేరారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉప ఎన్నికలు వస్తాయని స్టేషన్‌ఘన్‌పూర్‌లో రాజయ్యను గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

బ్రోకర్ మాటలు చెప్పి కుర్చీల కూర్చున్నవ్

సీఎం సీటు రాగనే పెద్దోడిని అవుతున్నా అనుకుంటున్నవు.. ప్రజలను మోసం చేస్తున్న నిన్ను ఆరు నెలల్లో గద్దె దింపుడు ఖాయం. సోనియగాంధీ పుట్టిన రోజున రుణమాఫీ చేస్తామని బ్రోకర్ మాటలు చెప్పి కుర్చీల కూర్చున్నవ్. రైతులను మోసం చేసిన నువ్వు జాగ్రత్తగ ఉండాలె.. తమాషా అనుకుంటున్నవా? రైతుబంధు పోయింది. రుణమాఫీ పోయింది. రైతుబంధు 15 వేలు అన్నవు. మోసం చేసినవు. మూడు కేజీలు ఉన్న రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేసిండు. ఇది రాక్షస పాలన. ఎవరైనా ఏమైనా అంటే జైల్లో పెడుతుండ్రు. ఇటువంటి పాలన నా 70 ఏండ్లలో చూడలేదు. కేసీఆర్ కిట్టు మాయమైంది. తులం బంగారం ఇవ్వకపోతివి. కేసీఆర్ పాలనలో రైతులందరూ సంతోషంగా ఉన్నారు. కేసీఆర్ సార్‌ను ఓడించి మేము చేసుకున్న తప్పిదం. మళ్ల కేసీఆర్ రావాలి. కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో పడేయాలి.

- గుగులోత్ జంతు, రైతు, రాంధన్ తండా

పెండ్లి కాలేదంటే.. భార్య ఆధార్ కావాలంటున్నరు!

- రుణమాఫీకి చిత్రవిచిత్ర నిబంధనలు
- రైతుల ఇబ్బందులను చెప్పిన హరీశ్

మహబూబాబాద్, అక్టోబర్4(నమస్తే తెలంగాణ): రుణమాఫీ కాని రైతులకు అధికారుల నుంచి చిత్రవిచిత్రమైన అనుభవాలు ఎదురవుతున్నాయి. అధికారులు అడుగుతున్న డాక్యుమెంట్ల వివరాలు చూస్తుంటే నవ్వాలో, ఏడవాలో అర్థం కాని పరిస్థితి! అసలు నాకు పెండ్లే కాలేదో మహాప్రభో అంటే.. అయితే, భార్య పేరిట ఆధార్‌కార్డు తీసుకురండి అని చెప్తున్నారు. ఎప్పుడో ఆధార్ అనేది పుట్టకముందే చనిపోయినవారి విషయంలోనూ ఆధార్ నంబర్ తెచ్చి ఇవ్వాలని కోరడం మరో తమాషా. ఇలాంటి ఉదంతాలను మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శుక్రవారం నిర్వహించిన రైతుల మహాధర్నాలో మాజీ మంత్రి హరీశ్‌రావు వివరించారు. 'సిద్దిపేట జిల్లా ఇబ్రహీంపూర్‌కు చెందిన ఎల్లారెడ్డికి రుణమాఫీ కాలేదు. ఆయన అధికారుల వద్దకు వెళ్లి అడగితే భార్య ఆధార్ కార్డు తెమ్మన్నారట.. ఆయన అసలు పెండ్లే చేసుకోలేదు. ఇప్పుడు భార్య పేరిట ఆధార్‌కార్డు ఎక్కడినుంచి తేవాలి. రుణమాఫీ కోసం ఈ వయసులో పెండ్లి చేసుకోవాల్నా? అని ఆ రైతు అంటుంటే ఎంతో బాధపడ్డాను' అని వివరించారు. 'మరో రైతు భార్య 2010లో చనిపోతే ఆధార్‌కార్డు తేవాలని అన్నారట. ఇలా మొత్తం 31 కొర్రీలతో రుణమాఫీ ఎగ్గొట్టారని దుయ్యబట్టారు.

జగిత్యాల కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న రైతులు

నమ్మించి.. వంచించారు.!

- వేర్వేరు చోట్ల యువతులపై లైంగికదాడులు
- పెండ్లి పేరుతో ఒకరిని.. స్నేహం ముసుగులో మరొకరిపై అఘాయిత్యం
- మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్ జిల్లాల్లో ఘటనలు
- జనగామలో ఇద్దరు బాలికలపై లైంగికదాడి

> రాష్ట్రంలో యువతులు, బాలికలపై వరుసగా జరుగుతున్న లైంగికదాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రేమిస్తున్నానని, పెండ్లి చేసుకుంటానని, స్నేహితులమని చెబుతూ నమ్మించి వంచిస్తున్నారు కామాంధులు. ఆశ్రయం కోసం ఎదురు చూస్తున్న అభంశుభం తెలియని బాలికలను లొంగదీసుకొని అఘాయిత్యానికి పాల్పడ్డారు.

మన్సూరాబాద్, అక్టోబర్ 4 : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్‌కు చెందిన ఎం సాయికుమార్ నాగోల్‌లోని ఓ హోటల్‌లో బౌన్సర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే సీనియర్ కెప్టెన్‌గా పనిచేసే ఓ యువతితో సాయికుమార్‌కు పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానంటూ, పెండ్లి చేసుకుంటానని ప్రాధేయపడటంతో అతని మాటలు నమ్మింది. ఈ క్రమంలో ఎల్బీనగర్‌లోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి ఆమెపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. పెండ్లి చేసుకోవాలని ఆమె బలవంతం చేయడంతో తల్లిదండ్రులతో మాట్లాడి ఏప్రిల్‌లో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. నెలలు గడుస్తుండడంతో పెండ్లి చేసుకోవాలని ఒత్తిడి తీసుకురాగా యువతిపై దాడి చేసి భయపెట్టాడు. దీంతో మోసపోయినట్టు గ్రహించిన యువతి సాయికుమార్‌పై చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆశ్రయం కల్పిస్తామని ఇద్దరు బాలికలపై..

జనగామ చౌరస్తా, అక్టోబర్ 4: జనగామ జిల్లా దేవరుప్పుల మండలానికి చెందిన ఓ బాలిక(14) తోపాటు మల్కాజిగిరి చెందిన మరో బాలిక (15) ఐఎస్ సదన్ డివిజన్‌లో ఉన్న పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్నారు. సెప్టెంబర్ 24న అక్కడి నుంచి బాలికలిద్దరూ పారిపోయి జనగామకు వచ్చారు. రాత్రి కావడంతో బస్టాండ్ సమీపంలో ఉన్న పాన్‌షాప్ నిర్వాహకుడి దగ్గర ఫోన్ తీసుకొని పరిచయం ఉన్న మరో యువకుడికి ఫోన్ చేశారు. బస్టాండ్‌కు చేరుకున్న ఆ యువకుడు జిల్లాకు చెందిన బాలికను వెంట తీసుకెళ్లి లైంగిక దాడి చేయగా, బస్టాండ్ దగ్గర ఉన్న మరో బాలికకు ఆశ్రయం కల్పిస్తానని నమ్మబలికిన పాన్‌షాప్ నిర్వాహకుడితోపాటు అతడి ముగ్గురు స్నేహితులు లైంగిక దాడికి పాల్పడినట్టు సమాచారం. మరుసటి రోజు రాత్రి బస్టాండ్ దగ్గర ఒంటరిగా తిరుగుతున్న బాలికల్ని గుర్తించిన జనగామ అర్బన్ పోలీసులు వారిని చేరదీసి విషయం తెలుసుకున్నారు. ఐదుగురు యువకులు కలిసి బాలికలపై లైంగిక దాడికి పాల్పడ్డారన్న విషయం తెలుసుకొని నిందితులపై పోక్సో కేసు నమోదు చేశారు.

లవ్ రిజెక్ట్ చేసిందని.. స్నేహం ముసుగులో..

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన తాటి శివరాజ్‌కుమార్ అలియాస్ జెట్టి వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నెపల్లిలోని బిట్స్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. శివరాజ్‌కుమార్‌కు భూపాలపల్లిలో తన స్నేహితుడు పుట్టపాక శరత్ ద్వారా మూడేండ్ల క్రితం ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలోని ఓ కళాశాలలో చదువుతున్న యువతి పరిచయమైంది. కొన్ని రోజుల తర్వాత ప్రేమిస్తున్నానని చెప్పగా ఆమె నిరాకరించి ఫ్రెండ్స్‌గా ఉందామని చెప్పింది. శివరాజ్‌కుమార్, తన స్నేహితులు వివేక్, మణిదీప్‌లతో కలిసి కారులో ఆమె చదువుకుంటున్న కళాశాలకు చేరుకున్నారు. మాయమాటలు చెప్పి ఆమెను బయటికి రప్పించి.. బలవంతంగా కారులో తీసుకెళ్లారు. వరంగల్ బస్టాండ్ సమీపంలో ఉన్న క్రిస్టల్ ఒయో లాడ్జీకి తీసుకెళ్లి ముగ్గురు కలిసి లైంగిక దాడి చేశారు. కళాశాలలో తెలిస్తే పరీక్షలు రాయనీయరని భయపడి ఎవరికీ చెప్పలేదు. పరీక్షల అనంతరం తల్లికి చెప్పడంతో ఇంతెజర్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. గురువారం సాయంత్రం ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జగిత్యాలలో కర్షకుల కదనభేరి

- రుణమాఫీ సహా హామీల అమలు కోసం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన
- ఐదుగంటలు ఆందోళన.. సొమ్మసిల్లిన రైతు
- కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ

జగిత్యాల టౌన్, అక్టోబర్ 4: జగిత్యాల జిల్లా రైతులు కదం తొక్కారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ చెప్పినట్టుగా షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా, అన్ని రకాల వడ్లకు మద్దతు ధరపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో భారీ నిరసన చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 2వేలకు మందికిపైగా తరలిరాగా, పాత మార్కెట్ బీటు నుంచి పాదయాత్రగా జగిత్యాల కలెక్టరేట్‌కు చేరుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతుందన్న నమ్మకంతో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలిచి గద్దెనెక్కించారని, కానీ గెలిచిన తర్వాత మోసం చేశారని విమర్శించారు. వాగ్దానాలు అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించి రైతుల్లో గందరగోళం సృష్టించారని మండిపడ్డారు. 40 శాతం మందికి మాత్రమే రుణమాఫీ చేసి మిగతా 60 శాతం మందిని గాలికొదిలేశారని ఆరోపించారు. రుణమాఫీ అమలులో లేనిపోని ఆంక్షలు విధిస్తూ రైతులను రోడ్డుపాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీలో రేషన్‌కార్డు అంటూ ఆంక్షలు విధించడం దారుణమని, బ్యాంకులు ఇచ్చిన రుణాల ఆధారంగా చేసుకొని రుణమాఫీ హామీని వంద శాతం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జిల్లా రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి, నాయకులు వేముల కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే రాష్ట్రం నలుమూలల నుంచి రైతులు తరలివెళ్లి ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులు దాదాపు 5 గంటలపాటు నిరసన వ్యక్తం చేసినా, కలెక్టర్ రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ గేటు వద్దకు చేరుకొని బారికేడ్లను తోస్తూ నినాదాలు చేయడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అదే సమయంలో కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామానికి చెందిన రైతు బద్దం మహేందర్‌రెడ్డి సొమ్మసిల్లిపోగా, పోలీసులు దవాఖానకు తరలించారు. నిరసన విషయం తెలుసుకున్న కలెక్టర్ అక్కడికి రాగా, రైతులు తమ డిమాండ్లను విన్నవించారు. డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

నిరసనలో సొమ్మసిల్లిపోయిన రైతు బద్దం మహేందర్‌రెడ్డి

బాలికలు, మహిళలకు భద్రత లేదు

- బాధ్యతారాహిత్యంగా రేవంత్ సర్కార్
- 9 నెలల్లోనే 2వేలకు పైగా లైంగికదాడులు
- ఇద్దరు బాలికలపై అఘాయిత్యం కలిచివేసింది : మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో బాలికలు, మహిళలకు భద్రత కరువైందని, భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఇటీవల ఇద్దరు బాలికలపై జరిగిన లైంగికదాడి తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. మహిళలకు భద్రత లేదని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని హెచ్చరించినా నిర్లక్ష్యం వీడలేదని, అందుకే నిత్యం రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట లైంగికదాడి ఘటనలు జరుగుతూనేఉన్నాయని శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో 2000కు పైగా లైంగికదాడి ఘటనలు జరిగాయంటే పరిస్థితి ఏ విధంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. హోంశాఖను కూడా తానే నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షణలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని, షీ టీమ్స్, సఖీ, భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి రక్షణ కల్పించిందని గుర్తుచేశారు. ఇందిరమ్మ రాజ్యమని ఊదరగొట్టడమే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యంలో మహిళా భద్రత లేదని తేటతెల్లమైందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి శాంతిభద్రతల పర్యవేక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. బాలికలపై లైంగికదాడిన పాల్పడిన దుర్మార్గులకు కఠిన శిక్షలు పడేలా చేయాలని డిమాండ్ చేశారు.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	39.7°c	21.7°c
మెదక్	36.2°c	21.9°c
ఖమ్మం	36.0°c	26.0°c
నల్లగొండ	36.0°c	25.0°c
రంగారెడ్డి	35.8°c	21.0°c
కరీంనగర్	35.0°c	26.0°c
నిజామాబాద్	34.1°c	24.3°c
వరంగల్	34.0°c	25.0°c
హైదరాబాద్	32.8°c	23.3°c
మహబూబ్‌నగర్	31.0°c	23.5°c

మరో మూడు రోజులు వానలు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో మూడు రోజులు వానలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గడిచిన 24 గంటల్లో హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాల్లో వర్షం కురిసిందని అధికారులు తెలిపారు. ఖమ్మం జిల్లా కొండమల్లేపల్లిలో అత్యధికంగా 6.84 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లా చందంపేటలో 5.91 సెం.మీ, నిడమనూరులో 4.45 సెం.మీ, గుండ్లపల్లిలో 4.98 సెం.మీ, పెద్దఅడిశర్లపల్లిలో 3.87 సెం.మీ, నాగర్‌కర్నూల్ జిల్లా పడ్రలో 4.19 సెం.మీ, ఉప్పునూతలలో 4.16 సెం.మీ, వంగూర్‌లో 3.88 సెం.మీ, రంగారెడ్డి జిల్లా మాడ్గులలో 4.05 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఈ నెల నుంచి డిసెంబర్ వరకు రాష్ట్రంలో సాధారణం కంటే అధిక వర్షాలు నమోదయ్యే అవకాశాలున్నాయని కేంద్రం అంచనా వేసింది.

సీఎంఆర్ఎఫ్‌కు విరాళాలు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి శుక్రవారం పలువురు విరాళాలు అందించారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ ప్రతినిధులు వీ సురేందర్, ఎస్ఎన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి రూ.1,01,75,000 చెక్కును అందజేశారు. అలాగే రూ.51 లక్షల చెక్కును విన్స్ బయో ప్రొడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ ఎస్ఎన్ డాగ, సీతావో సిద్ధార్థ డాగ, రూ.10 లక్షల చెక్కును ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎండీ కేవీ సుబ్బయ్య, డైరెక్టర్ సోమలింగంగౌడ్, రూ.25 లక్షల చెక్కును బొండాడ గ్రూప్ సీఎండీ బొండాడ రాఘవేంద్రరావు, 25 లక్షల చెక్కును భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఎండీ కే రామ్మోహన్‌రావు సీఎంకు అందజేశారు.

టీఎం హెచ్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసులు

హైదరాబాద్, అక్టోబర్4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కే శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన ఎన్నికల అధికారి శ్యామ్, ఉప ఎన్నికల అధికారి డాక్టర్ రామారావు నేతృత్వంలో మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా కే శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడిగా రామాంజనేయులు, జనరల్ సెక్రటరీగా సునీల్‌రాజ్, కోశాధికారిగా నామాల శ్రీనివాస్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రజాభవన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కిడ్నీ రోగులు

ప్రజాభవన్ ఎదుట కిడ్నీ రోగుల నిరసన

హైదరాబాద్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): కిడ్నీ రోగులను కాంగ్రెస్ సర్కారు చిన్నచూపు చూస్తున్నదని బాధితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కారు జిల్లా దవాఖానలు, సీహెచ్‌సీల్లో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించిందని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా మెరుగైన చికిత్స అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. గత జనవరి ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా, మంత్రులు, అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. కిడ్నీ రోగులకు ప్రతినెలా రూ.10వేల పింఛన్ ఇవ్వాలని, డయాలసిస్ సేవలను విస్తరించాలని డిమాండ్ చేశారు.